జీపుజాతాను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

బోగస్ చీట్‌ఫండ్స్..!



పది రూపాయలు వెనకేసుకుంటే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుంది అని చాలా మంది భావిస్తుంటారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఇలా ఎక్కువగా ఆలోచిస్తుంటారు. ఇలాంటి వారంతా ఇతరుల వద్ద చిట్టీలు వేస్తూ డబ్బును పోగు చేసుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇలాంటి వారి బలహీనతను ఆసరగా చేసుకున్న కేటుగాళ్లు కోట్లాది రూపాయలు వసూలు చేసుకుని రాత్రికిరాత్రే పరారీ అవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిట్టీల పేరుతో మోసం అంటూ నిత్యం ఏదో ఒక చోట ఘటనలు వెలుగు చూస్తునే ఉన్నాయి.

- నిబంధనలకు విరుద్ధంగా చిట్టీల నిర్వహణ
- నమ్మించి మోసం చేస్తున్న కేటుగాళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల వ్యాపారం

పేద, మధ్యతరగతి ప్రజలే బాధితులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ చిట్టీల నిర్వహణ జరుగుతోంది. కొందరు దీనినే ఉపాధి మార్గంగానూ ఎంచుకున్నారు. ఇలా రూ.1 లక్ష నుంచి రూ.కోటి రూపాయల వరకు కూడా జిల్లాలో చిట్టీలు జరుగుతున్నాయి. బడా ఫైనాన్షియర్లగా చెప్పుకునే వారు రూ.5 కోట్ల వరకు కూడా చిట్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. చిట్టీలు నిర్వహించే వారు ప్రారంభంలో డబ్బులను బాగానే ఇస్తారు. ఆ తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసుకుని ఉడాయిస్తున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, ధర్మవరం, కదిరి తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. మోసపోయిన బాధితులు న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు కూడా బాధితులకు ఎలాంటి న్యాయం చేయలేకపోతున్నారు. మోసం చేసిన వ్యక్తిని పట్టుకుని వచ్చినా అతను తన వద్ద డబ్బులు లేవని, తానూ మోసపోయాయని చెబుతున్నారు. దీంతో పోలీసులు కూడా చేసేది లేక కేసు నమోదు చేసి వదిలేస్తున్నారు. డబ్బులు కట్టిన వారికి మాత్రం ఒక్క రూపాయి వెనక్కు వచ్చే పరిస్థితి కన్పించడం లేదు.

అమలు కాని నిబంధనలు..

చిట్టీలు నిర్వహించాలనుకునే వారు ఖచ్చితంగా ప్రభుత్వం నిర్ధేశించిన నియమ నిబంధనలను పాటించాల్సి ఉంది. ఇందుకోసం చిట్‌ఫండ్స్ యాక్ట్ 1982 ఉంది. దీని ప్రకారం చిట్టీ నిర్వహణకు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. సంబంధిత శాఖ నుంచి లైసెన్స్ పొంది ఆర్‌బిఐ నిబంధనలకు లోబడే చిట్టీలను నిర్వహించాల్సి ఉంది. కొత్త గ్రూపును ప్రారంభించే ముందు దాని విలువకు అదనంగా 50 శాతం కలిపి రిజిస్ట్రేషన్ శాఖకు డిపాజిట్ చేయాలి. సభ్యుల పూర్తి వివరాలను రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించారు. అయితే చిట్టీల నిర్వాహకులు ఈ నిబంధనలు ఏవీ పాటించడం లేదు.

పెద్ద ఎత్తున మోసపోతున్న బాధితులు

బోగస్ నిర్వాహకుల వద్ద చిట్టీలు వేసిన పేద, మధ్య తరగతి ప్రజలు భారీగా నష్టపోతున్నారు. అనంతపురం, ధర్మవరం, కళ్యాణదుర్గం, తదితర ప్రాంతాల్లో చిట్టీల మోసాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ప్రజలు వారి సంపాదనలో కొంత మొత్తాన్ని ప్రతి నెలా కంతుల రూపంలో చిట్టీలకు చెల్లిస్తారు. పిల్లలు పెళ్లిళ్లు, చదువులు, ఇళ్ల నిర్మాణం తదితర వాటి కోసం డబ్బును ఆదా చేసుకునేందుకు చిట్టీలు వేస్తుంటారు. కంతులు పూర్తయ్యే సమయానికి నిర్వాహకులు బోర్డు తిప్పేస్తున్నారు. కొందరు మోసం చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోతుండగా, మరికొందరు తామూ నష్టపోయామని కావును డబ్బులు చెల్లించలేమంటూ చేతులేత్తేస్తున్నారు. ఇలాంటి సమయంలో బాధితులు పోలీసులను ఆశ్రయించిన పెద్దగా ఫలితం ఉండడం లేదు. సదరు మోసం చేసిన వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు పిలిపించినా తన వద్ద ఒక్క పైసా లేదని, ఈ పరిస్థితుల్లో తాను డబ్బులు ఇవ్వలేనని చెబుతున్నారు. దీంతో పోలీసులు కూడా అతన్ని ఏమీ చేయలేక బాధితుల కోసం కేసు నమోదు చేసి వదిలేస్తున్నారు. పోలీసులు మాత్రం ఇలాంటి నకిలీ చిట్టీ వ్యాపారులను నమ్మి మోసపో వద్దంటూ హెచ్చరి స్తూనే ఉన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న వారి వద్ద మాత్రమే చిట్టీలు వేయాలని చెబుతున్నా ప్రజలు బోగస్ నిర్వాహకులను నమ్మి మోసపోతూనే ఉన్నారు.

నిర్వాసితులకు న్యాయమైన

పరిహారం ఇవ్వండి

- 544-డి రోడ్డు బాధితుల పక్షాన పోరాటం
- రోడ్డు నిర్వాసితులు, ఎపి రైతుసంఘాల ఆధ్వర్యంలో జాపుజాతా
- ప్రారంభించిన వి.రాంభూపాల్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం, పుట్లూరు, శింగనమల, తాడిపత్రి రూరల్

జిల్లాలో బుక్కరాయసముద్రం మండలం రోటపురం నుంచి తాడిపత్రి మండలం భోగసముద్రం వరకు జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు , భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని రోడ్డు నిర్వాసితులు, ఎపి రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డు పనుల్లో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోతున్న బాధితులకు న్యాయమైన పరిహారం ఇచ్చిన తరువాతనే పనులు చేపట్టాలని కోరుతూ రోడ్డు నిర్వాసితులు, ఎపి రైతుసంఘాల ఆధ్వర్యంలో జీపుజాతాను శనివారం చేపట్టారు. రోటరీపురం వద్ద జాతాను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 544-డి పాములాయి నుంచి గుంటూరు వరకు 4017 కిలోమీటర్లు జాతీయ రోడ్డును వేస్తున్నారన్నారు. ఇందులో జిల్లాలో 65 ఎకరాలు భూమి, 400 ఇళ్లను కోల్పోతున్నారని చెప్పారు. వీటికి సంబంధించి 2017వ సంవత్సరంలో నోటిఫికేషన్ విడుదల చేశారని, 2019లో పరిహారం ధరలు నిర్ణయించారని చెప్పారు. అప్పుడు పరిహారం డబ్బులు ఇవ్వకుండా 2023వ సంవత్సరంలో 2019 ధరలతో పరిహారం ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. 2023 ధరల ప్రకారమే బాధితులకు పరిహారం ఇవ్వాలన్నారు. శివపురం, బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజు కాలవ, పెరవలి, నాయనపల్లి క్రాసింగ్‌లో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులకు కనీసం సెంటు రూ.50వేలతో పరిహారం ఇవ్వాలన్నారు. పూర్తిగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. ఇళ్లకు సంబంధించి 2023 భూముల రేటు ప్రకారం నష్ట పరిహారం చెల్లించడంతో పాటు, 5 సెంట్ల స్థలం ఇచ్చి అందులో ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు ప్రయివేటు భూములతో సమానంగా ధరను నిర్ణయించి పరిహారం ఇవ్వాలన్నారు. నిర్వాసితుల పక్షాన ఈ నెల 23వ తేదీన కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం అధికారులు స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 544-డి నిర్వాసితుల సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఎపి.రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు విటి.రామాంజినేయులు, రాజారామిరెడ్డి, గుత్తా వెంకటచౌదరి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణ రెడ్డి, ఓబిరెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర, పుల్లయ్య పాల్గొన్నారు.

ఈపీఎఫ్, ఈఎస్ఐ బెనిఫిట్స్ ఇవ్వకపోతే ఆందోళనలు

బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న కార్మిక యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థలో అనారోగ్యంతో చనిపోయిన పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల కుటుంబ సభ్యులకు రావాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ బెనిఫిట్స్ సకాలంలో ఇవ్వకపోతే భవిష్యత్తులో దశలవారీగా ఆందోళనలు చేపడతామని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు హెచ్చరించారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, డెత్ బెనిఫిట్స్ ఇవ్వాలని శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు దాదాపు 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ అనంతను పరిశుధ్య నగరంగా తీర్చిదిద్దడంలో కృషిచేస్తున్నారన్నారు. ప్రజారోగ్యం కోసం కార్మికులు దుమ్ము, దూళి, మలినాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. గత కొన్నేళ్లలో సుమారు 45 మంది పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అనారోగ్యం బారినపడి మరణించారన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, డెత్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్, పెన్షన్లు వర్తించలేదన్నారు. అధికారులకు, పాలకవర్గానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఏఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఇబ్బందులుపడుతూ జీవితాలను వెల్లదీస్తున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి ఆ కుటుంబాలకు రావాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ బెనిఫిట్స్ అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు బండారు. ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు శేషేంద్ర కుమార్, లక్ష్మీనారాయణ, కోశాధికారి తిరుమలేశు, నగర మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, సహాయ కార్యదర్శి బత్తల ఆదినారాయణ, మిత్ర సంఘాల నాయకులు నల్లప్ప, ముత్తురాజు, దేవరాజు, సర్దానమ్మ, కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, నాగేంద్ర, జ్యోతి, బాబు, ఇంజినీరింగ్ కార్మికులు, బాధిత కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికరాజ్య నిర్మాత లెనిన్

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

గణేనాయక్ భవన్‌లో లెనిన్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మానవసమాజ పురోభివృద్ధిలో అత్యంత పురోగామి సోషలిస్టు వ్యవస్థను రష్యా దేశంలో నిర్మించిన గొప్ప విప్లవ సారధి, కార్మిక రాజ్యనిర్మాత లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. లెనిన్ 99వ వర్ధంతి సభను శనివారం సాయంత్రం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంభూపాల్ మాట్లాడుతూ రష్యా దేశంలో మొట్టమొదటి సారి 1917లో సోషలిజాన్ని స్థాపించిన లెనిన్ నేటికీ ప్రపంచ పీడిత ప్రజలకు మార్గదర్శిగా ఉన్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మించడంలో, దాన్ని ప్రజా పార్టీగా తీర్చిదిద్దడంలో ఆయన మేధో కృషి అద్భుతమన్నారు. సామ్రాజ్యవాదులు తమ దోపిడీని కొనసాగించడానికి మానవాళికి వినాశకరమైన రెండు ప్రపంచ యుద్ధాలను సృష్టిస్తే లెనిన్ ఆ యుద్ధాలకు అంతం పలికే సోషలిజాన్ని సృష్టించారన్నారు. కార్మికులు, కష్టజీవులు, రాజ్యాన్ని పాలించగలరని 70 సంవత్సరాల రష్యాలో సోషలిస్టు వ్యవస్థ నిరూపించిందన్నారు. నేడు ప్రపంచంలోని అన్ని దేశాలూ ఆర్థిక మాద్యంలో కొట్టుమిట్టాడు తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో సోషలిజం గురించి ప్రపంచంలోని అనేక దేశాల్లో మేధావులు చర్చిస్తున్నారన్నారు. అలాంటి సోషలిస్టు దేశాన్ని భారతదేశంలో సాధించేందుకు సిపిఎం సభ్యులందరూ పట్టుదలగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.సావిత్రి, రామాంజినేయులు, ఆర్‌వి.నాయుడు, రాజమోహన్, ప్రకాష్, మసూద్, పోతులయ్య, శివశంకర్, సురేష్, రాము పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు సజావుగా నిర్వహిద్దాం

ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షలను ఆదివారం సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పి ఫక్కీరప్ప అధికారులను ఆదేశించారు. శనివారం నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లు, పోలీసు అధికారులతో ఎస్పి తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియమ నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం జరిగే కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా సమిష్టిగా చర్యలు తీసుకుందామన్నారు. అనంతపురం, గుత్తి కేంద్రాలుగా మొత్తం 47 ఎగ్జామ్ సెంటర్లు, ఉమ్మడి అనంతపురం జిల్లాలకు చెందిన 24055 మంది పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద, కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షల సమయం కంటే గంట ముందు నుంచే అభ్యర్ధులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. సెల్‌ఫోన్, వాచ్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొద్దన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి ఫక్కీరప్ప

అనంతపురం, గుత్తి సెంటర్ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 10 ఫ్లైయింగ్ స్క్వాడ్ ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, డీఎస్పీలు యు.నరసింగప్ప, ఎస్ మహబూబ్‌బాషా, సిఎం గంగయ్య, శ్రీనివాసులు, జెఎన్‌టియు ప్రిన్సిపల్ సుజాత, గేట్స్ కళాశాల ప్రిన్సిపల్ సిద్ధేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో బోధనా సిబ్బంది బదిలీలకు శ్రీకారం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయులో బోధన, పరిపాలన యంత్రాంగంలో పలువురుని బదిలీ చేస్తూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన శనివారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. ఉపకులపతి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో ప్రధానంగా అనంతపురం జేఎన్టీయూ ఆచార్యులు ఎస్.వసుంధరను పులివెందుల జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా డిప్యుటేషన్ మీద నియమించారు. ఆచార్య వి.సుమలతకు అకడమిక్ డైరెక్టర్‌తో పాటు ఇండస్ట్రియల్ రిలేషన్స్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆచార్య ఎ.సురేష్ బాబుకు డైరెక్టర్, సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్ సెంటర్‌తో పాటు డైరెక్టర్ అకడమిక్ ఆడిట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆచార్య బి.ఈశ్వర్‌రెడ్డి డైరెక్టర్, అడ్మిషన్స్‌తో పాటు డైరెక్టర్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆచార్య సి.శశిధర్‌కు రిజిస్ట్రార్‌తో పాటు డైరెక్టర్ ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆచార్య పిఆర్.భానుమూర్తి స్పెషల్ ఆఫీసర్, సెంటర్ ఫర్ బ్రిడ్జి, టన్నెల్ ఇంజినీరింగ్ అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నియమించడం జరిగినది. అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఎస్.కృష్ణయ్యను డిప్యూటేషన్ కింద కలికిరి ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు. పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల గణితం విభాగం ఆచార్య ఎం.చెంగల్‌రాజును అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారున. ఓటీపీఆర్ఐ కళాశాల బయో టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.విజయలక్ష్మిని కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విభాగాధిపతిగా నియమించారు.

సామాజిక సేవాభావం అలవర్చుకోవాలి

ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థి దశలోనే సామాజిక సేవా భావం, దేశభక్తిని అలవర్చుకోవాలని జేఎన్టీయూ అనుబంధ ఓటీపీఆర్ఐ కళాశాల డైరెక్టర్ ఆచార్య బి.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఓటీపీఆర్ఐ కళాశాల నందు జాతీయ సేవాపథకంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ఔషధ ఉద్యానవనాన్ని విద్యార్థులు శుభ్రపరచి మొక్కల పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. యువతీ యువకులు క్రమశిక్షణతో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా చేయడం జాతీయ సేవా పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ గోపీనాథ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కెయు.శైలజ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులుగా నాగరాజు

రాయదుర్గం : రాయదుర్గం రిక్రియేషన్ క్లబ్, రీడింగ్ రూం నూతన అధ్యక్షులుగా గురుమాల్ నాగరాజు ఎన్నికయ్యారు. క్లబ్ 2023-24వ ఆర్థిక సంవత్సరానికి జరిగిన పాలకమండలి ఎన్నికల్లో అధ్యక్షులుగా గురుమాల్ నాగరాజు, ఉపాధ్యక్షులుగా మోపురి వేంకటేశులు, కార్యదర్శిగా కెఎన్.రాజు, ఉప కార్యదర్శిగా పోరాళ్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గౌర సత్యనారాయణ, మేనేజర్ భాస్కర్ రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ

ఆత్మకూరు : ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మాత శిశు సంరక్షణ సేవలు, అసంక్రమిత వ్యాధుల సర్వే అప్లోడ్, పిహెచ్‌సి కాన్పులు తదితర వాటిపై ఆరాతీశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ఇన్‌ఛార్జి వైద్యాధికారి సుజాత, వైద్యులు దయాకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం దిశగా చర్యలు

ఎమ్మెల్సీ వై.శివరాంరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉరవకొండ ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆర్డబ్ల్యూఎస్ అధికారులతోఉ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలలో ఉన్న తాగునీటి సమస్యను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారన్నారు. 135 పనులకు సంబంధించి రూ.65.94 కోట్లు కేవలం తాగేటి సమస్య పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారన్నారు. ఉరవకొండ పట్టణంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించి ఉరవకొండ పట్టణంలోనే కనీసం 5 లేదా 6 నూతన ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు నిర్మించి పట్టణ ప్రజలకు తాగినటి సమస్య తీర్చే విధంగా ఽప్రతిపాదనలు సిద్ధం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని వెలుగొండ, షేక్షానిపల్లి గ్రామాలతోపాటు విడపనకల్, వజ్రకరూర్, బెలుగుప్ప, కూడేరు మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి వెంటనే అవసరమైన చోట ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు నిర్మించి, పైప్‌లైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం కేటాయించాలని నిధులతో ఆయా పనులు చేపట్టడానికి ఇబ్బందులు ఉన్నట్లు ఎమ్మెల్సీ శివరాం రెడ్డికి అధికారులకు సూచించడంతో ఎమ్మెల్సీ సంబంధిత జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వీలైనంత తొందరలో ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధించి పనులు చేపట్టే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ అంజుమన్ సుప్రీన్, జేఈలు ధనుంజయ, ఫామిద, హర్షవర్ధన్, ద్రాక్షాయని తదితరులు పాల్గొన్నారు.

'పివికెకె'లో ఆన్‌లైన్ మాదిరి పరీక్ష

అనంతపురం : రుద్రంపేటలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం జేఎస్‌కే ప్రజ్ఞ అకాడమీ ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ మాదిరీ పరీక్ష శనివారం నిర్వహించారు. ఈ సంధర్భంగా కళాశాల చైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ "దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్దేశించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ పరీక్షకు ముందస్తు సంసిద్ధత కోసం ఆన్‌లైన్ మాదిరి పరీక్షను పీవీకేకే ఐటీలో నిర్వహించామన్నారు. ప్రజ్ఞ అకాడమీ చైర్మన్ వెంకటేషులు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి కొరత లేకుండా చైర్మన్ పల్లె కిషోర్ కళాశాలలో మాదిరి పరీక్షలు నిర్వహించుకోవటానికి అనుమతి ఇచ్చారన్నారు.

IN THE COURT OF THE XIV ADDL. CHIEF JUEDGE, CITY CIVIL COURTS COMPLEX, AT HYDERABAD.
O.S. NO. 123 OF 2012.

Between:
M/s. Padmapriya ConstructionsPetitioner/ Hyderabad.
....Plaintiff
And
Mr. Mahesh Kumar Agarwal Respondent/ And two others.
....Defendants.

To:
1. Mrs. K.Vidhyulatha, S/oK.S.D.Satyaraj, Aged 61 years, Occ: Lecturer R/o 14/367-D, New, Back side of Swagath Hotel, Kamalanagar, Anathapur District.
....Respondent/Defendants

Whereas the above I.A. No. 1090 of 2022 in I.A. No. 186 of 2022 in O.S. No. 123 of 2012 and the I.A. is posted to 10 th February 2023(Friday) for your appearance and reply if any.

You are hereby advised to appear on the said date i.e10 th February 2023(Friday) at 10.30 AM before the said Hon'ble Court, and in the event of failure of your appearance on the said day, the matter will be dealt with and decided in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)

Place: Hyderabad:
Date : 21stJanuary 2023.

K. SRILATHA,
Advocate,
H.No.12-13-528/52, Flat No. 204,
Sri Sai Nivasam, Street No.14,
Nagarjuna Nagar, Colony, Tarnaka,
HYDERABAD - 500 040.
Cell - 9849733396

In the Court of the VIth Addl. District Judge:Gooty
O.S.No.04/2022

Between:
1. A.Shakuntala 2. T.Yasodha ...Plaintiffs
And
N.Suryakala and Others ...Defendants

Notice to Defendant No.3 and 7
D3: T.Radhadevi W/o T.Mallikarjuna Gowd, R/of D.No.11-6, Chetnepalli Village, Gooty mandal, Anantapuramu Dist.
D7: M.Sunitha W/o Anil Gowd, R/of Chandrapriya Nagar, AVR School, Gooty R.S., Gooty Mandalam, Anantapuramu Dist.

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం తేది:24-01-2023వ తేది ఉ॥10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎం.శ్రీనివాసులు, ఎం.వి.మహేష్‌కుమార్
అడ్వకేట్లు
అనంతపురం, సెల్: 9490737421.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
Creditor I.P.No.24/2016

Between:
చింబిలి విజయ ...పిటీషనర్
మరియు
ఇస్కాల నాగరత్నయ్య మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు

మొదటి ప్రతివాదికి నోటీసు

To,
R1: ఇస్కాల నాగరత్నయ్య S/o ఐ.క్రిష్ణమూర్తి, డోర్‌నెం. 13-551-4, అంభాభవానీ వీధి, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై దావాలో పిటీషనర్ పై Creditor I.P.No.24/2016 ను దాఖలు చేసియున్నారు. సదరు దావా మొదటి ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 27-01-2023 వ తేదీన వాయిదా వేసినారు. అందువలన తెలుపడము ఏమనగా పై తేదీన స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను అని తెలుపడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

అప్పా కృష్ణయ్య, ఎం.ఏ., ఎల్.ఎల్.బి.
టి.ధనుంజయ్య, ఎం.ఏ., బి.ఎల్.,
వాదిపరం న్యాయవాదులు, తాడిపత్రి, గుత్తి.

In the Court of the Prl. District Judge:Anantapuramu
G.O.P.No.06/2023
(In the matter of appointment of guardian to the person and Property of the minor Shaik Nowshad and Shaik Shakila)

Between:
Shaik Mahaboob Bee W/o Shaik Mahaboob Peera, R/of D.No.4-264, Gandhi Nagar, Bukkarayasamudram Village and Mandal, Anantapuramu Dist. ...Petitioner
And
To whom so ever it may concern ...Respondent

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా పై నెంబరు కేసులో షేక్ నౌషాద్ మరియు షేక్ షకీల మైనర్లుకు గార్డియన్‌గా వుండుటకు మరియు మైనర్లుకు రావలసిన ఆస్తిని మరియు మొత్తమును తీసుకొనుటకు పై కోర్టునందు షేక్ మహబూబ్ బీ పిటీషనరు దావా దాఖలు చేసియున్నారు. సదరి కేసులో ఎవ్వరికైన ఎలాంటి ఆక్షేపణలున్న యెడల స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ 01-02-2023వ తేది ఉదయం 10.30. గం॥లకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనియెడల పై కోర్టువారు అర్జీదారులరాలు పరముగా తీర్మానింతురని తెల్పడమైనది.

షెడ్యూలు:
Amount of Rs.84,564-30 in S.B. A/c No.31642010066871 in Canara Bank, Anantapuramu (IFSC CNRB0013164)
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

Cidde Gangadhara Reddy, Smt. A.Lakshmi Devi
Advocates, Anantapuramu, Cell:9440152733.

రాజకీయ జాతరలు..

సంక్రాంతి పండుగను వినియోగించుకున్న నాయకులు
పలు గ్రామాల్లో విందు భోజనాలు
ప్రజలను దగ్గర చేసుకునే యత్నం

ప్రజాశక్తి-అనంతపురం

ఈ వారం అంతా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి శోభ కన్పించింది. బంధువులు, మిత్రులతో పండగను జరుపుకున్నారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా వారి స్వగ్రామానికి వచ్చి మూడు రోజుల పాటు పండగను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్నారు. ఇదే సమయంలో రాజకీయ నేతలు పండుగను కూడా వారికి లబ్ధి చేకూర్చునే విధంగా మలుచుకున్నారు. పలు నియోజకవర్గాల్లో జాతరలు, విందుల పేరుతో ముఖ్య నాయకులు కార్యకర్తలు, మద్దతుదారులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ, తాడిపత్రి, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో 'రాజకీయ జాతర'లు జరిగాయి. ముఖ్యంగా అధికార పార్టీలో ఈ రకమైె జాతరులు కన్పించాయి. నియోకవర్గ ముఖ్య నేతలే ఇందులో పాల్గొనడం విశేషం. మద్దతుదారులను మచ్చిక చేసుకోవడంతో పాటు, అసమ్మతి నేతలను దగ్గర చేసుకునేందుకు ముఖ్య నేతలు జాతరలను ఉపయోగించుకున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో వైసిపి అసమ్మతి వర్గం ఓ విందును ఏర్పాటు చేసింది. పనిలోపనిగా స్థానిక ఎమ్మెల్యేపై అక్కడే అసమ్మతి గళం విన్పించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో మనమందరం ఏకంగా ఉండి ఆ నేతకు సహకరించరాదని మాట్లాడుకున్నట్లు సమాచారం. ఇక రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలో బొంద్రాయి జాతరను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరలో పెద్ద సంఖ్యలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, ఎమ్మెల్యేలు విందులో పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఇక్కడ పెద్ద సంఖ్యలో జనాలను సమీకరించి అనుచరుల మద్దతు కూడగట్టే యత్నం వైసిపి నేతలు చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో వారి జనబలాన్ని ప్రదర్శించే పనిని చేపట్టారు. ధర్మవరంలో ప్రతి ఏటా మాదిరే సంక్రాంతిని పురస్కరించుకుని జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో రాజకీయ నేతలు పాల్గొన్నారు. ఆయా దేవాలయాల వద్ద పలు పార్టీల ముఖ్య నేతలు కుటుంబ సభ్యులతో సహా వెళ్లి స్థానికులను కలుసుకునే ప్రయత్నం చేశారు. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరిగిన జాతరలో సైతం మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఇలా అధికార పార్టీ నేతలందరూ భవిష్యత్తు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంక్రాంతి పండుగను రాజకీయ జాతరలతో బాగానే వినియోగించుకున్నారని చెప్పాలి.

లాకప్‌డెత్ మిస్టరీ

రాయదుర్గం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఈ నెల 17వ తేదీన ఓ నిందితుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తీవ్ర సంచలనం రేపింది. గొర్రెల దొంగతనం కేసులో పోలీసుస్టేషన్‌కు పట్టుకుని వచ్చిన నిందితుడు పోలీసు స్టేషన్‌లోనే లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు కొట్టి లాక్‌ప్‌డెత్ చేశారంటూ పెద్ద ఎత్తున విమర్శలు విన్పించాయి. అరెస్టు చేసిన నిందితుడిని లాకప్‌లో ఉంచకుండా కంప్యూటర్ గదిలో ఉంచడం, ఆత్మహత్య చేసుకునే సమయంలో మరో నిందితుడు పక్కనే ఉండడం, మృతుని కుటుంబ సభ్యులు కూడా ఈ మరణంపై మాట్లాడకుండా మౌనం వహించడం.. ఈ ఘటన ఎలా జరిగిందనే విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండా పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. కాగా ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ సిఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఓ హోంగార్డును జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుస్టేషన్‌లో జరిగిన ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

'దుర్గం'లో పొలిటికల్ వార్

కళ్యాణదుర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య పొలిటికల్ వార్ కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉషశ్రీచరణ్ భూ కబ్జాలకు పాల్పడ్డారంటూ టిడిపి నేతలు ఆరోపణలు చేశారు. కబ్జాలకు సంబంధించిన సాక్షాధారాలను మీడియాకు చూపించారు. దీనిపై మంత్రి కూడా స్పందించారు. తనపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారని, బిసి మంత్రిని అయినందునే ఇలాంటివి చేస్తున్నారంటూ టిడిపి నేతల ఆరోపణలను తిప్పకొట్టారు. ఇలా టిడిపి, వైసిపి నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు, ఛాలెంజ్‌లు చేసుకున్నారు.

ట్రూ అప్ విధానాన్ని రద్దుచేయాలి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ఏపీ విద్యుత్ సంస్థలో ట్రూ అప్ విధానాన్ని రద్దుచేసి ప్రజలకు భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు నిర్మల మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి ట్రూ అప్ చార్జీలను ఏపీఈఆర్సీ దృష్టికి తెచ్చి బహిరంగ విచారణ అనంతరం అమలు చేసే విధానం ఉందన్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం దాన్ని నెల నెలా సర్దుబాటు చేయాలని యోచిస్తోందని అన్నారు. పబ్లిక్ హియరింగ్‌తో సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని ఆమె విమర్శించారు. విద్యుత్ చట్టం 2003 కు ఆ పద్ధతి విరుద్ధమని మండిపడ్డారు. రెగ్యులేటరీ ప్రాసెస్‌ను కూడా ప్రభుత్వం దెబ్బతిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయాలని పూనుకుంటోందన్నారు. ప్రస్తుతం జెన్కో ప్లాంట్లలో ఆ ప్రక్రియ అమలు చేసేందుకు యత్నిస్తున్నారని వెంటనే ఆ ప్రయత్నాలను ఆపాలని కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత 3 ఏళ్లలో అనేక విద్యుత్ ప్రమాదాలు జరిగి 210 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. అందుకు ప్రధాన కారణం 20 ఏళ్ల కిందట విద్యుత్ సరఫరా కోసం ఎల్‌టి లైన్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అయితే హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ పథకం కింద ఎల్‌టి విద్యుత్ తీగలను 11 కేవికి మార్చడం వల్ల అధిక లోడును తట్టుకోలేక తీగలు తెగిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. విద్యుత్ ప్రమాదాల పై ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 1.070 ఫిడర్ల పరిధిలో అధికారులు సర్వే నిర్వహించారని ఆ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. మల్లేష్, యు.మల్లికార్జున, సి.రమేష్, దస్తగిరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని అమలుచేయాలి

తహశీల్దారుకు కెవిపిఎస్ వినతి

వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని శాశ్వతంగా అమలుచేయాలని కెవిపిఎస్ నగర, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దారు శ్రీధర్ మూర్తికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, గిరిజనులకి జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించడానికి కేవీపీఎస్, 195 ప్రజాసంఘాల పోరాట ఫలితంగా ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక 2013 వచ్చిందన్నారు. అప్పటినుంచి ప్రభుత్వాలు మారినప్పటికీ దళిత, గిరిజనులకు బడ్జెట్ కేటాయింపులు చేయడమే కాకుండా వాటిని ఖర్చు పెట్టడానికి ప్రయత్నం జరిగిందన్నారు. దీనివల్ల 23 శాఖలు 249 పథకాలకు సంబంధించి దళిత గిరిజనులకు లబ్ధి పొందే అవకాశం ఉండేదన్నారు. అయితే చట్టంలో చాప్టర్ నంబర్ నాలుగులో ఈ చట్టానికి కాలపరిమితే పది సంవత్సరాల అని ఉందన్నారు. ఈనెల 23వ తేదీ నాటికి పది సంవత్సరాలు పూర్తి అవుతోందన్నారు. ఈ సందర్భంగా చట్టాన్ని పూర్తిస్థాయిలో శాశ్వతంగా అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని చట్టం చేయాలని కోరారు. కెవిపిఎస్ ఇతర దళిత, గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తోందన్నారు. అందులో భాగంగా అనంతపురం తహశీల్దారుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ కమిటీ అధ్యక్షులు జీవరత్నం, నగర కమిటీ అధ్యక్షులు అక్కులప్ప, రూరల్ కమిటీ కార్యదర్శి రాజా, నగర నాయకులు మల్లెల ఎర్రిస్వామి, శివ, శ్రీనివాసులు, కృష్ణవేణి, నల్లప్ప, నరసింహ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కబ్జాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా..?

టిడిపి నాయకులు ఉన్నం మారుతీ చౌదరి

మారుతి చౌదరిని కనేకల్ స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ కబ్జాలపై చేసిన సవాళ్లను స్వీకరిస్తే పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం హేమమైన చర్య అని టిడిపి యువనాయకుడు ఉన్నం మారుతి చౌదరి ధ్వజమెత్తారు. శనివారం మంత్రి ఉషశ్రీ చరణ్ సుజిలాన్ కంపెనీతో బినామీ పేర్లతో కొనుగోలు చేసిన 160 ఎకరాల పొలాన్ని పరిశీలించి అవినీతి అక్రమాలను ప్రజలకు తెలియజేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం డిఎస్పి శ్రీనివాసులు సిఐలు, ఎస్ఐలతో కలిసి టిడిపి నాయకులను గృహ నిర్బంధం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి మాజీ ఎమ్మెల్యే చౌదరికి, మొరేపల్లి మల్లికార్జున కరణం రామ్మోహన్ చౌదరి తదితరులకు నోటీసులు జారీచేశారు. కొండపల్లి సమితిలో ఉన్న మంత్రి భూములను పరిశీలించేందుకు వెళుతున్న మారుతి చౌదరి, గోళ్ల వెంకటేశులు తదితర నాయకులను డిఎస్‌పి అడ్డుకొని అరెస్టు చేశారు. వీరిని కనేకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై మారుతి చౌదరి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసిపి పాలనలో అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు పెచ్చు మీరిపోయాయన్నారు. మంత్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా పనిచేయడం సిగ్గుచేటు అన్నారు. మంత్రి సవాళ్లను స్వీకరిస్తూ మరోసారి ఆ భూములను పరిశీలించేందుకు వెళ్తామని ఆ తేదీని త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

పుట్లూరు : టిడిపి నాయకుల అక్రమ అరెస్టులు సిగ్గుచేటు అని ఆపార్టీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి గరికపాటి సుదర్శన్ నాయుడు అన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాలు, వాస్తవాలు వెలుగులోకి తెచ్చే మీడియాపై ఎదురుదాడి ఆపి ప్రజా సమస్యలపై మంత్రి ఉష శ్రీచరణ దృష్టిపెట్టాలని హితవుపలికారు.

శింగనమల : అక్రమాలపై ప్రశ్నిస్తే అరెస్ట్ చేయడం దుర్మార్గమని అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి అన్నారు. టిడిపి నాయకుల అక్రమ అరెస్టులను ఖండించారు. ఈ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

ఆత్మకూరు : మంత్రి ఉషశ్రీ చరణ్ అక్రమ భూదందాల పరిశీలనకు వెళుతున్న హిందూపురం పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు బి.కె పార్థసారథి, బీసీసెల్ అధ్యక్షులు బడముద్దల రంగయ్య, తదితరులను కనగానపల్లి పోలీసులు అరెస్టుచేసి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు దుబ్బ రవీంద్రారెడ్డి, అంకె ఆనంద్, లక్ష్మీదేవి పరామర్శించారు.

మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటిని ముట్టడిస్తాం

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటిని ముట్టిస్తామని ఆమె వ్యతిరేకవర్గం నాయకులు హెచ్చరించారు. శనివారం మంత్రి వ్యవహారశైలిని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, కురుబ సంఘం తాలూకా అధ్యక్షులు దొనస్వామి, వాల్మీకి సంఘం తాలూకా అధ్యక్షులు ములకనూరు తిమ్మరాయుడు, సీనియర్ నాయకులు కోనాపురం గంగాధర్, గొల్లపల్లి సర్పంచి రామాంజనేయులు గోళ్ళ సూరి తదితరులు మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌ను నిలదీశారు. వైసీపీ నాయకుడు ఒంటిమిద్ది స్వామి మంత్రి ఉషశ్రీ చరణ్‌ను విందుకు పిలవలేదని ఇంటిని కూల్చేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రిస్వామి ఇటీవల ఆ గ్రామంలో ఇంటిని నిర్మిస్తున్నాడు. ఇదివరకు మంత్రికి సన్నిహితంగా ఉన్న ఎర్రిస్వామి మంగళవారం గ్రామంలో జాతర చేశారు. ఆ జాతరకు ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మలు విందుకు హాజరయ్యారు. మంత్రిని విందుకు పిలువలేదని మున్సిపల్ అధికారులను అడ్డుపెట్టుకొని తనకు రెండు నోటీసులు జారీచేయించిందన్నారు. శుక్రవారం ఇంటిని పడగొడుతున్నట్లు మున్సిపల్ అధికారులు ఎర్రిస్వామికి సమాచారం అందించారు. దీంతో ఎర్రిస్వామి తీవ్ర ఆందోళనకు గురై తనకు జరిగిన అన్యాయాన్ని సహచరులకు తెలియజేశాడు. దీంతో నాయకులు కమిషనర్‌ను నిలదీస్తూ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సూటిగా ప్రశ్నించారు. పట్టణ నడిబొడ్డులో నిర్మించిన కన్యకా పరమేశ్వరి కాంప్లెక్స్‌కు అనుమతులు ఎక్కడనని ప్రశ్నించారు. దీంతో కంగుతిన్న కమిషనర్, టిపిఎస్ అలివేలమ్మలు ఇల్లు కూల్చేస్తామని తాము చెప్పలేదని, అనుమతులు పొందాలని నోటీసులు మాత్రమే జారీ చేశామన్నారు. ఛైర్మన్ తలారి రాజ్‌కుమార్ కమిషనర్ తీరును ఖండించారు. ఎలాంటి సమాచారం లేకుండా అధికార పార్టీ నాయకులకే నోటీసులు ఎందుకు జారీచేశారని నిలదీశారు. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇబ్బంది కలిగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ, దొడగట్టు సూరి, టైలర్ శీను, తిమ్మారెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం : మంత్రి ఉషశ్రీ

కుందుర్పి : రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న లక్ష్యమని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. శనివారం కుందుర్పి మండల పరిధిలోని నాగేపల్లి, శీగలపల్లి, కొల్లారహట్టి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అవినీతి రహితంగా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే అందజేస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బంది గ్రామంలోనే ఉన్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సర్పంచి గోవిందమ్మ, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, మాజీ సర్పంచి సుదర్శన్ రెడ్డి, జడ్పిటిసి రాధాస్వామి, ఎంపిపి కమల నాగరాజు, కో ఆప్షన్ మెంబర్ ముజీవుల, వాల్మీకి స్టేట్ డైరెక్టర్ పాలాక్షి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో సర్పంచి ఆంజనేయులు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ పద్మ, ఎంపిటీసీ వెంకటేశులు, మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిరుపాల్‌రెడ్డి, ఎంపీడీవో షకీలా బేగం, తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బెలుగుప్ప : బెలుగుప్ప మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన శ్యామలమ్మకు రూ.70 వేలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.

నేరాలు ఘోరాలు

కోళ్లు, కుక్కలపై దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

నాలుగు కోళ్లు, ఒక కుక్క మృతి

బొమ్మనహాల్ : ఓ ఆర్టీసీ బస్సు కోళ్లు, కుక్కలపై దూసుకెళ్లడంతో నాలుగు కోళ్లు, ఒక కుక్క మరణించిన సంఘటన బొమ్మనహాల్ మండల కేంద్రంలోని మారుతీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. బొమ్మనహాల్ మండల కేంద్రంలోని మారుతీ నగర్‌లో రాయదుర్గం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు (ఏపీ 29 జడ్ 3862) డ్రైవర్ మద్యం మత్తులో బస్సును కోళ్లు, కుక్కలపైకి తోలాడు. ఈ సంఘటనలో నాలుగు కోళ్లు, ఒక కుక్క మృతిచెందాయి. ఆగ్రహించిన స్థానికులు డ్రైవర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరానికి తాగునీరు సరఫరా చేసే పిఎబిఆర్ ప్రధాన పైపులైనుకు హంసపల్లి వద్ద లీకేజీ ఏర్పడినట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్ తెలిపారు. లీకేజీ మరమ్మతులు చేస్తుండడంతో నగరంలో ఆదివారం తాగునీటి సరఫరా ఉండదన్నారు. నగర ప్రజలు గమనించి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎంపిడిఒ చిత్రా శ్రీనివాసులుకు అభినందనల వెల్లువ

గుత్తి : నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన చిత్రా శ్రీనివాసులుకు అభినందనలు వెల్లువెత్తాయి. శనివారం సర్పంచులు కర్లకుంట రమేష్ బాబు, ఎ.వెంకటేష్, చిదంబరి, మజ్జిగ గోపాల్, రామలింగమయ్య, ఎంపీటీసీ చిన్న వీరన్న గౌడ్, వైసిపి నాయకులు రాము యాదవ్, లక్ష్మినారాయణ, రామిరెడ్డి, ఎం.రామాంజనేయులు, లాలూ నాయక్ కార్యాలయానికి చేరుకొని ఎంపిడిఒ చిత్రా శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. మండల అభివృద్ధికి సహకరించాలని సర్పంచులు ఎంపీడీవోని కోరారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ విశాలాక్షి సహకారంతో పరిష్కారం చూపుతానని తెలిపారు.

నేషనల్ లెవెల్ టెన్నిస్ క్రికెట్ బాల్‌కు శ్రీ చైతన్య విద్యార్థి

అనంతపురం : స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న కె.సాయి దినేష్ కార్తీక్ ఏలూరు జిల్లాలోని చింతలపూడిలో ఈనెల 10, 11 తేదీలలో జరిగిన స్టేట్ లెవెల్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించి నేషనల్ లెవల్‌కు సెలెక్ట్ అయ్యాడు. ఈ విద్యార్థికి ఏజీఎం సుబ్బారెడ్డి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. శ్రీ చైతన్య విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్‌లు రుషిబాల, అప్పలనాయుడు, ఏవో గోపాల్, పిఇటి సురేష్ పాల్గొన్నారు.

భూ రీసర్వేపై సమీక్ష

నార్పల : భూ రీసర్వేపై దుగుమర్రి గ్రామ సచివాలయంలో ఈవోఆర్డీ లక్ష్మినరసింహ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు, ప్రార్థనా మందిరాలు, నివాస, నివాసేతర నిర్మాణాలు, రోడ్లు, కాలువలకు రీ సర్వే ద్వారా కొలతలు నిర్వహిస్తామన్నారు. సర్వే జరిగేటప్పుడు ప్రజలు తమ ఇంటి హక్కును నిరూపించే ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు మొదలగు వివరాలను దగ్గర ఉంచుకుని సర్వే బృందానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అంగన్వాడీ టీచర్లకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఎ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున, సాయిచరణ్, చంద్ర, శ్రీనివాసులు, రాఘవేంద్ర, వీఆర్వోలు లక్ష్మన్న, నరసింహులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంఖీ, చంద్రబాబు, సర్వేయర్ ప్రియాంక పాల్గొన్నారు .

గృహ నిర్మాణాలపై సమీక్ష

రాయదుర్గం : గృహ నిర్మాణాల పనితీరుపై హౌసింగ్ డిఇ చంద్రశేఖర్ సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ.. రాయదుర్గం పట్టణ పరిధిలోని అడుగుప్ప లేఅవుట్ నందు 12 వార్డ్ సచివాలయాలకు సంబంధించి మొత్తం 206 జగనన్న ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. లేఅవుట్‌లోని లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణంలో వారికున్న ఇబ్బందులను తెలుసుకోవాలన్నారు. సిమెంట్, ఇటుకలు, స్టీల్ ఇతర మెటీరియల్స్ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్మాణాలు త్వరతిగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ జయచంద్ర, మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీనాథ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

'అనంతలక్ష్మి'కి ఎకో సిస్టమ్ ఎనబెలర్ అవార్డు

అనంతపురం : అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ఎఐసి ఎస్‌కెయు వారు స్టార్టప్ జాతర 4 వ వార్షికోత్సవం సందర్భంగా 2023 సంవత్సరానికి ఎస్‌కె యూనివర్సిటీ అటల్ ఇంక్యూబేషన్ సెంటర్ వారు బెస్ట్ స్టార్ట్ అప్ ఎకో సిస్టమ్ ఎనబెలర్– ఎమర్జింగ్‌కు అనంతలక్ష్మి కళాశాలకు అవార్డు ప్రకటించారని కళాశాల ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే తెలిపారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి కళాశాల విద్యార్థులు ఎఐసి ఎస్‌కెయులో జరిగిన స్టార్టప్ జాతరలో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రతిభ కనబరచినందుకు అవార్డు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ అనంత రాముడు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పోటీ పరిస్థితులకు, స్టార్టప్ ఆలోచనలు, సూచనలు, నూతన టెక్నాలజీస్, ఆవిష్కరణల పైన విద్యార్థులు కళాశాల బృందం చేసిన కృషికి ఈ అవార్డ్ రావడం సంతోషాదయకం అన్నారు. ఈ కార్యమంలో ఎస్‌కెయు విసి.రామకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు నాగభూషణ్‌రాజు, సిఇఒ శివకిరణ్, చంద్రమౌళి, అనంతలక్ష్మి కళాశాల ప్రోగ్రాం కో ఆర్డినేటర్ స్మిత, విద్యార్థులు, అద్యాపకులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా ఫెర్రర్ విగ్రహం ఏర్పాటు

అనంతపురం : కలెక్టరేట్ ఎదురుగా చెరువుకట్ట వైపు వీలైనంత త్వరగా ఫాదర్ విన్‌సెంట్ ఫెర్రర్ విగ్రహం పున:ప్రతిష్ట పనులను పూర్తి చేస్తామని జాతీయరహదారుల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి .మధుసూధనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్ళారి బైపాస్ నుండి పంగల్ రహదారి వరకు నాలుగు వరసల రహదారి విస్తరణలో భాగంగా జాతీయ రహదారుల నిబంధనలననుసరించి రహదారి మధ్యలో (డివైడరు) వున్న మహనీయుల విగ్రహాలను జిల్లా అధికారుల సూచనల మేరకు తొలగించి వాటిని జాగ్రత్తగా భద్రపరిచామన్నారు. ప్రస్తుతం ఆ విగ్రహాలను తిరిగి ప్రతిష్ఠించుటకు అనువైన స్థలానికై జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్‌ను సంప్రదించామన్నారు. అందులో భాగంగా ఒక కమిటీ ద్వారా కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా చెరువుకట్ట రహదారి వైపు ఫాదర్ విన్‌సెంట్ ఫెర్రర్ విగ్రహం ప్రతిష్ఠించుటకు అనుమతులు పొందామని చెప్పారు.

కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

ఉరవకొండ : ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గ సభ్యుల ఎన్నికకు స్థానిక టౌన్ బ్యాంకులో సభ్యులచే నామినేషన్ల దాఖలు ప్రక్రియ శనివారం జరిగింది. కో–ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిష్ట్రార్, ఎన్నికల అధికారి బాలగంగాధర్ సభ్యుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. నామినేషన్‌కు వెయ్యిరూపాయల రుసుం స్వీకరించారు. మొత్తం 4,132 మంది సభ్యులకు ఓటర్లుగా నమోదయి వున్నారు. 11 మంది పాలక మండలి సభ్యుల ఎన్నిక కోసం 21 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. ఆదివారం దరఖాస్తు చేసిన నామినేషన్ల పరిశీలన, 23న నామినేషన్ల ఉపసంహరణ వుంటుందని ఎన్నికల అధికారి బాలగంగాధర్ తెలిపారు. పాలకవర్గానికి పోటీ లేకపోతే అదేరోజు సాయంత్రం ఏకగ్రీవం అయినట్లు ప్రకటిస్తామన్నారు. పోటీ ఉన్నట్లయితే 29వ తేదీ ఎస్‌కె హైస్కూల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. 30వ తేదీన గెలుపొందిన డైరెక్టర్లు అధ్యక్షుడు, ఉపాధ్యక్షున్ని ఎన్నుకొంటారన్నారు. ఈ నామినేషన్ల కార్యక్రమంలో పీఐసీ రవి, బ్యాంక్ సీఈవో వేదమూర్తి, డీఎల్‌సీవో సతీష్, అనంతపురం ఎస్డీఎల్‌వో పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎంపిడిఒ

బుక్కరాయసముద్రం : అనంత సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో తేజోత్స్న శనివారం పరిశీలించారు. పదో తరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత స్థాయిని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమ్మెటివ్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. బాగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు.